www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 జనవరి 2023

5

కాకినాడ

శునకాలపై కోడి మమకారం

శునకాలపై పడుకున్న కోడి

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

శునకం పిల్లలను పొదుగుతున్న కోడిని చూసేందుకు పొన్నాడ పంచాయతీ రావివారిపాడులో పలువురు ఆసక్తి చూపుతున్నారు. గ్రామంలో రామాంజనేయులు ఇంటిలోని శునకం ఇటీవల ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. అదే సమయంలో కోడి గుడ్లు పెట్టింది. ఆ గుడ్లను కుక్క తినేసింది. అయినా శునకం పెట్టిన ఐదు కుక్కపిల్లలను కోడి కంటికి రెప్పలా కాపాడుతోంది.

చలికి విద్యార్థులు గజగజ

- శిథిలావస్థలో సంక్షేమ వసతి గృహాలు
- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు

రాజపూడిలో శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనం ఆవరణలో విద్యార్థులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో సంక్షేమ వసతి గృహ విద్యార్థులు చలికి గజగజ వణికిపోతున్నారు. పలు భవనాలు శిథిలావస్థకు చేరి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మూడేళ్లుగా ప్రభుత్వం దుప్పట్లను కూడా పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులకు దోమల బెడద కూడా తప్పడం లేదు. దీంతో పలువురు బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు అనారోగ్యాల పాలై తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాకినాడ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 22 పోస్ట్ మెట్రిక్, 12 ప్రి మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు నాలుగు వేల మంది పిల్లలు ఏటా చేరుతున్నారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 17 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 1,058 మంది, 23 ప్రి మెట్రిక్ హాస్టళ్లలో 1,048 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

చలికి వణుకుతున్న విద్యార్థులు

అనేక వసతి గృహాలు శిథిలావస్థకు చేరడంతో తలుపులు, కిటికీలు డోర్లు సరిగా లేవు. ప్రస్తుతం విపరీతంగా చలిగాలులు వీస్తున్న తరుణంలో పలువురు విద్యార్థులు చలిని తట్టుకోలేక నిద్రలు లేని రాత్రులు గడుపుతూ అనారోగ్యాలు గురవుతున్నారు. కాకినాడ బిసి కాలేజీ హాస్టల్ పూర్తిగా శిథిలం అయింది. ఇక్కడ 100 మంది విద్యార్థులు వసతి పొందుతుండగా గత కొంత కాలంగా చలిని తట్టుకోలేక ఇళ్ల నుంచి దుప్పట్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. ముత్తా నగర్‌లో ఉన్న బాలికల వసతి గృహంలో 70 మంది ఉంటున్నారు. గత కొన్నేళ్లుగా భవనం శిథిలావస్థకు చేరడంతో బాలికలు భయం భయంగా వసతిని పొందుతున్నారు. మరోవైపు చలిని తట్టుకోలేక చెప్పుకోలేని అవస్థలు ఎదుర్కొంటున్నారు. తూరంగి బిసి కాలేజ్ హాస్టల్‌లో 130 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడ కూడా భవనం పూర్తిగా పాడై కూలేందుకు సిద్ధంగా ఉంది. తలుపులు, కిటికీలు సరిగా లేక చలికి వణుకుతున్నారు. జగన్నాథపురం వంతెన వద్ద బిసి బాలుర హాస్టల్లో 120 మంది ఉండగా సరైన వసతులు లేక నేరుగా చలి గాలి గదుల్లోకి చేరుతోంది.

కాకినాడ ఆనంద నిలయంలో 50 మంది పిల్లలు ఉన్నారు. ఈ హాస్టల్ భవనం కూడా శిథిలావస్థకు చేరి చలిలో వణుకుతున్నారు. ఎస్‌సి కాలేజీ బాలుర హాస్టల్లో 180 మంది వసతిని పొందుతుండగా గదులు సరిపోవడం లేదు. జగ్గంపేట మండలం రాజపూడి ఎస్‌సి బాయ్స్ స్కూల్ హాస్టల్లో 130 మంది ఉండగా భవనం శిథిలావస్థకు చేరి, గదులు సరిపోక పిల్లలు ఆరు బయట నిద్రిస్తున్నారు. తుని ఎస్‌సి స్కూల్ పిల్లల హాస్టల్, ఎస్‌టి కాలేజ్ అమ్మాయిలు హాస్టల్ శిథిలావస్థలో ఉన్నాయి.

కరువైన కనీస వసతులు

ఎస్‌సి, బిసి, ప్రి మెట్రిక్ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు కరువైనా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. సంక్షేమానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. 15 ఏళ్లుగా ప్రభుత్వం పెట్టెలను పంపిణీ చేయడం నిలిపివేసింది. హాస్టళ్లను వదిలి వెళ్లిన విద్యార్థులు వాడి వదిలేసిన పెట్టెలే కొందరికి ఉపయోగపడుతున్నాయి. సరైన స్నానపు గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేసే దుస్థితిని కొన్ని వసతిగహ విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. బాలికల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. అరకొరగా ఉన్న మరుగుదొడ్లు, స్నానపు గదులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో గడుపుతున్నారు. హాస్టళ్ల పర్యవేక్షణను అధికారులు గాలికొదిలేశారని విమర్శలు తీవ్ర స్థాయిలో వెల్లువెత్తుతున్నాయి.

వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించాలి

ప్రస్తుతం హాస్టల్ విద్యార్థులు చలికాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు రోజుకి తీవ్రత పెరుగుతోంది. పలు హాస్టళ్లలో కిటికీలు, తలుపులు సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. ప్రభుత్వం వెంటనే దుప్పట్లు అందివ్వాలి. దోమతెరలు పంపిణీ చేయాలి. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇతర మౌలిక సదుపాయాలు అన్నీ కల్పించాలి.

- కె.శివ శంకర్, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి, జగ్గంపేట.

చలికి ఇబ్బంది పడుతున్నాము

వసతి గదులు సరిపోక ఆరు బయట నిద్రిస్తుండగా చలిని తట్టుకోలేక పోతున్నాము. ప్రభుత్వం 2019 నుంచి దుప్పట్లు ఇవ్వడం లేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లతో సరిపెట్టుకుంటున్నాం. అవి కూడా చిరిగిపోతున్నాయి. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దుప్పట్లు పంపిణీ చేయాలి.

- రాయుడు వీరేంద్ర, 10వ తరగతి, రాజపూడి హాస్టల్, జగ్గంపేట మండలం

విద్యార్థులు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి

బ్యాగ్స్ అందిస్తున్న హిమాన్సు శుక్లా, కృతికా శుక్లా

ప్రజాశక్తి-కాకినాడ

కెరీర్ పరంగా నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు విద్యా నైపుణ్యాలతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా విద్యార్థులకు సూచించారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఆనంద నిలయంలో 1969-81 మధ్య ఉండి, చదువుకున్న 45 మంది పూర్వ విద్యార్థులు ఇక్కడ ప్రస్తుతం చదువుకుంటున్న 96 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా కుటుంబ సభ్యులతో హాజరై విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించారు. విద్యార్థుల ఇంగ్లీష్ నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కృతికా శుక్లా మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు జరగడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థుల మిత్ర బృందం ఇక్కడ ప్రస్తుతం ఉంటున్న విద్యార్థులకు మార్గదర్శకులని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆనంద నిలయంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు పూర్వ విద్యార్థులు ఆర్థికేతర మద్దతు అందించాలని కోరారు. ఇంతమంచి కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు ఆనంద నిలయం పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల మిత్ర బందం ఆనంద నిలయానికి గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంగ్లీష్, ఇతర విద్యా నైపుణ్యాలతో పాటు విద్యార్థులు ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కతికా శుక్లా సూచించారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా మాట్లాడుతూ ఆనంద నిలయంలో చదువుకుంటున్న విద్యార్థులు బాగా చదివి ఐఎఎస్, ఐపిఎస్ వంటి ఉన్నత స్థానాలను అందుకోవాలని సూచించారు. తాను ఒక సాధారణ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సమయంలో పాఠశాలకు వచ్చిన జిల్లా కలెక్టర్‌ను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ఐఎఎస్ సాధించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జెడి జె.రంగలక్ష్మీదేవి, ఆనంద నిలయం సంక్షేమ అధికారి పి.లోవరాజు, మిత్రబందం సమన్వయకర్త సిహెచ్.మోహన్‌రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

సమావేశంలో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ పిలుపు ఇచ్చారు. ఆదివారం సాధనాల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన యానాం రైస్ మిల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాంలో రైస్ మిల్లు సరిగ్గా నడకపోవడతో కార్మికులకు పని దినాలు తగ్గుతున్నాయని, దీని కారణంగా కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనానరు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల కార్మిక వర్గం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను ఉపసరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పెయ్యిల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజు, దొమ్మేటి సూరిబాబు, సబ్బతి రాంబాబు, వడ్డి నాగేశ్వరరావు, సత్తిబాబు, వై.శ్రీను నాలుగు రైస్ మిల్లుల కార్మికులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ

మెడికల్ రిప్స్ తొలగింపులు ఆపాలి

ప్రజాశక్తి-కాకినాడ

మెడికల్ రిప్స్ అక్రమ తొలగింపులు ఆపాలని, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ పటిష్టంగా అమలు చేయాలని ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఎపిఎంఎస్‌ఆర్‌యు) డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక శ్రీనగర్‌లోని కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ హాల్లో మెడికల్ రిప్స్ యూనియన్ నగర అధ్యక్షులు కె.అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రటరీ సిహెచ్.కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ఫార్మా కంపెనీలు పెద్ద ఎత్తున లాభాలు సంపాదించుకుంటున్నా, అదే స్థాయిలో ఏ కారణం లేకుండానే మెడికల్ రిప్స్‌ను అక్రమంగా తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ రిప్స్‌కు పని నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన ఆందోళన వల్ల కేంద్ర ప్రభుత్వం స్పందించి ఒక కమిటీని నియమించిందన్నారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ 1976ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అత్యవసర నిత్యావసర మందులపై జిఎస్‌టి పూర్తిగా తొలగించాలని, ప్రభుత్వ వైద్య ఆరోగ్య రంగాలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, మెడికల్ రిప్స్‌ను హైలీ స్కిల్డ్‌గా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ సమాజ హితం కోరే డిమాండ్లను రూపొందిస్తున్న, చేస్తున్న మెడికల్ రిప్స్ యూనియన్ కృషిని అభినందించారు. మెడికల్ రిప్స్ యూనియన్ మరింత సంఘటితం అవ్వాలని ఆకాంక్షించారు. గుంటూరు యూనిట్ అధ్యక్షులు ఫణి సౌహార్ద సందేశం ఇచ్చారు. తొలుత అమరవీరులకు జోహార్లు అర్పించారు. రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రటరీ సి.వెంకట్రావు నూతన కమిటీని ప్రతిపాదించగా ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎం.ఎ.స్వామి, కార్యదర్శిగా ఎఆర్‌సి.వర్మ, కోశాధికారిగా కె.రామకృష్ణ, ఉపాధ్యక్షునిగా కె.అప్పారావు, దీక్షితులు, సహాయ కార్యదర్శులుగా శ్యామ్, వెంకటేష్, కమిటీ సభ్యులుగా నాగేంద్ర కుమార్, రాజేష్, అశోక్, రామ్మోహన్, సత్తిబాబు, నరేష్, కిశోర్, గుప్తా, షంషుద్దీన్, అప్పారావు, అయ్యప్ప, ప్రసాద్, దుర్గాప్రసాద్, హుస్సేన్, సుబ్రహ్మణ్యం, శ్రీధర్, కష్ణ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు జిలానీ, చరణ్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా విజ్ఞాపనల స్వీకరణ కార్యక్రమం స్పందన సోమవారం కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుంచి కార్యక్రమం సాగుతుందని, అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ అంశాన్ని గమనించాలని ఆమె కోరారు.

గంగాధర్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఆదిత్య గంగాధర్‌కు పురస్కారం

ప్రజాశక్తి-గండేపల్లి

హైదరాబాద్‌లో గచ్చిబౌలిలో ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం ఆదిత్య సూరంపాలెం క్యాంపస్ మీడియా మేనేజర్ ఇంజనీరింగ్ కళాశాల క్యాషియర్ తోటకూర గంగాధర్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నట్టు విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. 20 ఏళ్లుగా ఆదిత్య సంస్థలకు క్యాషియర్, మీడియా మేనేజర్‌గా సేవలందిస్తున్న గంగాధర్ శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షునిగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజసేవ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ ప్రతి పుట్టినరోజుకూ తన మిత్రుల పుట్టినరోజుకు మొక్కలు నాటడం, పంచడం అలవాటుగా చేసుకున్నారు. ఈ విధంగా లక్షకు పైగా మొక్కలు నాటడం ద్వారా 2019లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు అందుకున్నారు. ఆదిత్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ మేడపాటి భాస్కర్ చంద్రారెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది గంగాధర్‌ను అభినందించారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి నివారించాలని, పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం చేపట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని మెరుగు పరచాలని యుటిఎఫ్ జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కచేరిపేట యుటిఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ, జిల్లా అధ్యక్షుడు కెవివి నగేష్, ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి, అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్, డిఎలు, ఎపిజిఎల్ఐ, తదితర ఆర్థిక బకాయిలు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నాయన్నారు. తాము దాచుకున్న సొమ్ము కూడా అవసరాలకు ఉపయోగించుకునే పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. ఏ హామీ లేకుండానే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్ రద్దు చేస్తున్నాయని గమనించాలన్నారు. సిపిఎస్ రద్దు చేసే వరకు ఐక్యంగా తమ పోరాటం సాగుతుందన్నారు. ఎన్నికలు, జనగణన తప్ప ఏ విధమైన బోధనేతర పనులు ఉపాధ్యాయులకు అప్పగించరాదని చాలా కాలంగా కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల విధులు తప్పించి, టాయిలెట్లు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు వంటి పద్దతులతో బోధనకు చాలా ఆటంకాలు కలిగిస్తోందని, ఈ పద్దతులు తగవన్నారు. ఉపాధ్యా యులను తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రశాంతంగా పాఠాలు చెప్పుకునే వాతావరణం ఉండాలన్నారు. నూతన విద్యా చట్టం 2020 పేరుతో రాష్ట్రంలో ప్రాథమిక విద్య ధ్వంసం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. 3, 4, 5 తరగతులు హైస్కూల్లో విలీనం తగదని, ఇంగ్లీష్ మీడియంతో సమాంతరంగా తెలుగు మీడియం కూడా ఉండాలన్నారు. ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలు మానుకోకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

2023 క్యాలెండర్ ఆవిష్కరణ

సమాజంలో తమదైన ప్రభావం కలిగించిన జాషువా, గురజాడ, కందుకూరి, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, ఆరుద్ర, రావిశాస్త్రి, అద్దేపల్లి, సోమసుందరం తదితర కవులు, రచయితల చిత్రాలతో యుటిఎఫ్ కాకినాడ జిల్లా శాఖ రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెవివి.నగేష్, టి.రవిచక్రవర్తి, కోశాధికారి పివిఎన్.గణేష్, సహాధ్యక్షులు ఐ.ప్రసాదరావు, జిల్లా కార్యదర్శులు సాయిరాం, సూరిబాబు, రాజు బాబు, పెద్దిరాజు, వివి రమణ, కె.దుర్గాదేవి ఎన్.గోవిందరాజులు, పివివి సత్యనారాయణ, సోనీ పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



బొగ్గవరపు సత్రం ఆక్రమణల తొలగింపు

అక్రమణలను తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సర్పవరం గ్రామంలో బొగ్గవరపు సత్రానికి సంభందించిన ఎకరం భూమి కబ్జాకు గురైందని వస్తున్న వార్తా కథనాలపై మాజీ మంత్రి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు స్పందించారు. ఆదివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో దేవాదాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. బొగ్గవరపు ఆస్తులు ఆక్రమణకు గరవకుండా చూడాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆక్రమణలను తొలగించారు. అధికారుల దష్టికి తీసుకుని వెళ్ళామని చెప్పారు. కాకినాడ రూరల్ లోని యండమూరు వెంకటేశ్వస్వామి ఆలయనికి, రమణయ్యపేట నూకాలమ్మ అమ్మవారు సర్పవరం భావనారాయణ స్వామి వారి ఆలయాలకు విలువైన ఆస్తులు ఉన్నాయన్నారు. యండమూరులో వెంకటేశ్వస్వామి ఆలయాలకు సంబందించి 25 ఎకరాల భూమిని కొంతమంది తప్పుడు పత్రాలు సష్టించి కబ్జా చెసే ప్రయత్నం చేసినప్పుడు వాటిని అడ్డుకున్నట్టు చెప్పారు. బొగ్గవరపు సత్రానికి సంబందించిన ఎకరం భూమిపై కోర్టులో కేసు నడుస్తున్నా కొంతమంది తప్పుడు దారిలో కబ్జా చెయ్యాలని చూస్తున్నారన్నారు. కొన్ని సాంకేతిక పరమైన కారణాలను చూపించి దేవాదాయ శాఖ భూములను కబ్జా చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. దేవాదాయ ధర్మాదాయ భూములకు సంబంధించిన ఆస్తులపైన ఎటువంటి అక్రమాలకు పాల్పడినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి పి.నారాయణ మూర్తి, బొగ్గవరపు సత్రం ఇఒ శివబాబు, ఇతర అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య' ఆధ్వర్యాన తీర పరిశుభ్రత

కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, ఆలిండియా విమెన్స్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో కాకినాడ సముద్ర తీర పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. జాతీయ సేవా పథకం, ఆలిండియా విమెన్స్ కాన్ఫరెన్స్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు సముద్ర తీర పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు 120 మంది విద్యార్థులు బృందాలుగా విడిపోయి వాకలపూడి బీచ్‌లోని ప్లాస్టిక్ వ్యర్థాలు, పగిలిన గాజు పదార్థాలను సేకరించి, కొంతమేరకు పరిశుభ్రపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆలిండియా విమెన్స్ కాన్ఫరెన్స్ కాకినాడ బ్రాంచ్ సెక్రెటరీ ఎన్.భానుమతి మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ రహిత సమాజం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ట్రెజరర్ పద్మజావాణి మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతి ఆదివారం సేవకు కొంత సమయాన్ని కేటాయించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా విమెన్స్ కాన్ఫరెన్స్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, శ్రీమతి మీనాక్షి, అలివేణి, సిబ్బంది, సూర్యారావుపేట గ్రామ పంచాయతీ కార్యదర్శులు కె.వెంకటరత్నం, ఎ.త్రినాథ్, పారిశుధ్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కాకినాడ ఆలిండియా విమెన్స్ కాన్ఫరెన్స్, ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.

మత్స్యకారులకు ఆయిల్ సబ్సిడీ ఇవ్వాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మత్స్యకారులకు రావాల్సిన ఆయిల్ సబ్సిడీ సొమ్మును బంకులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని మాజీ ఎంఎల్ఎ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ అన్నారు. ఉప్పాడ గ్రామంలో ఆదివారం రచ్చబండ కార్యక్రమం చేపట్టి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఇదేమి ఖర్మ అని మత్స్యకారులు చాలా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 6 నెలలుగా ఆయిల్ సబ్సిడీ కార్డులకు రావాల్సిన సొమ్ములు ఇవ్వకుండా లోకల్ పెట్రోల్ బంకు వారు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ కార్డులు తీసుకువెళ్లే వారే బంకు దగ్గర సగానికి అమ్ముకునే పరిస్థితికి ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని అధికారం చేపట్టి మూడున్నరేళ్లవుతున్నా మత్స్యకారులకు కూసింత సహాయం కూడా చేసింది లేదన్నారు. వారికి రావాల్సిన సొమ్మును వారే వేరే విధంగా వాడుకునే పరిస్థితి వైసిపి ప్రభుత్వానిదని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో మత్స్యకారుల కోసం ఏ పథకం లేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయంలో మత్స్యకారులను అన్నివిధాలా ఆదుకున్నామని, పార్టీలకు అతీతంగా 1000 ఆయిల్ సబ్సిడీ కార్డులు ఇచ్చామని,బోట్స్, వలలు, ఆయిల్ ఇంజిన్లు ఇతర పరికరాలు అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అనిశెట్టి సత్యానంద రెడ్డి, మత్స్యకార నాయకులు సూరాడ రాజు, చోడిపల్లి ప్రసాద్, సూరాడ నాగేశ్వరరావు, ఎంపిటిసి బాదం నాగేశ్వరరావు, మేరుగు భూషణం, రాచపల్లి సనపయ్య, కొప్పాల రాంబాబు, సూరాడ జాన్, ఒసిపల్లి అప్పన్న, చొక్కా దావీద్, కారే పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన జెఇఇ మెయిన్స్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జెఇఇ మెయిన్స్ పరీక్షలు ముగిశాయి. ఈ పరీక్షలకు ప్రిసిడింగ్ ఆఫీసర్‌గా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, టెస్ట్ సెంటర్ ఆఫీసర్‌గా ప్రొఫెసర్ ఎం.రాజబాబు వ్యవహరించారు. ఈ రోజు పరీక్షకు ఉదయం, సాయంత్రం రెండు షిఫ్ట్‌ల్లో అందరూ హాజరు అయ్యారని సెంటర్ అబ్జర్వర్ రాజబాబు తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటిలు), నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటిలు), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటిలు) విద్యాసంస్థల్లో ప్రవేశాలకు జెఇఇ మెయిన్ పరీక్షలు నిర్వహిస్తారు.

ఆర్గానిక్ సాగుతో రైతులకు లాభాలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆర్గానిక్ వ్యవసాయం ద్వారా రైతన్నకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సహజ వ్యవసాయ సంచాలకులు కెజెకె.రాజన్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో వ్యవసాయ పద్ధతులు, ఆర్గానిక్ సర్టిఫికేషన్ అనే అంశంపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతుల శాస్త్రీయపరమైన పరిజ్ఞానం, వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి రసాయనాలను అధిక దిగుబడులు పొందాలన్నారు. ఆర్గానిక్ సర్టిఫికేషన్ చేయడం ద్వారా అధిక ధరలు పొందే అవకాశం ఉంటుందన్నారు. భూసార పరీక్షలు మొదలుకొని వాడిన ఎరువులు, పురుగు మందులు మొదలైనవి రికార్డు రాసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ మాధవి, మండల వ్యవసాయ అధికారి గంగాధర్, వ్యవసాయ సహాయకులు రైతులు ఉన్నారు.

అంజలీదేవికి ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రముఖ సినీనటి అంజలీదేవి 9వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పలువురు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. అంజలీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అంజలీదేవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంజలీదేవి ఫౌండేషన్ చైర్మన్ గోలి రామారావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో పలువురు ప్రసంగించారు. పెద్దాపురం పట్టణానికి చెందిన అంజలీదేవి నాటక రంగంలో ఆమె నటించిన పాత్రలు, నృత్యాలు, సినిమా రంగంలో ఆమె నటించిన చిరస్మరణీయమైన పాత్రలను వివరించారు. ఈ ఆమె జ్ఞాపక చిహ్నంగా పెద్దాపురంలో ఆమె పేరుతో మందిరం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్, ప్రముఖ రంగస్థలం కళాకారులు కింతాడ సన్యాసిరావు, జనసేన నియోజకవర్గ ఇనఛార్జి తుమ్మల రామస్వామి (బాబు), మున్సిపల్ కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, యండమూరి విజయలక్ష్మి, ఒబిలిశెట్టి నూకరత్నం, డాక్టర్ శ్యామల, రవికృష్ణ, బుచ్చిబాబు, పొలమరశెట్టి సత్తిబాబు, కంభంపాటి కాశీ పాల్గొన్నారు.

శ్రామికులకు అండగా ఈ శ్రమ్

లేబర్ సహాయ కమిషనర్ వల్లీ

శ్రామికులకు అండగా ఈ శ్రమ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఈ శ్రమ్ ద్వారా అసంఘటిత రంగంలో పనిచేసే ప్రతి ఒక్క శ్రామికునికీ ఎంతో మేలు కలుగనుందని కార్మిక శాఖ సహాయ కమిషనర్ బిఎస్ఎం.వల్లీ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకుని ప్రయోజనాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. అసంఘటిత రంగ కార్మికులకోసం ఈశ్రమ్ పథకం గత 2021 ఆగస్టు 26న ప్రారంభించారు. ఈ పథకంలో చేరితే అనేక ప్రయోజనాలున్నాయని అధికారులు కార్మికుల పని ప్రదేశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వలస కార్మికులను గుర్తించి వారికి ఉపాధి కల్పించేందుకు ఈ శ్రమ్ చక్కగా ఉపయోగపడుతుందని చెప్తున్నారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం జిల్లాలో సర్వే నిర్వహిస్తున్నారు. దీంతో ఈశ్రమ్ వెబ్‌పోర్టల్‌లో నమోదు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది.

ఈ శ్రమ్‌తో ప్రయోజనాలు ఏమిటి. ఎంతమందిని నమోదు చేశారు.?

ఈ శ్రమ్‌లో ఇప్పటి వరకూ 3,15,056 మందిని నమోదు చేశాం. ఈ శ్రమ్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వపరంగా అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందినా, శాశ్వతంగా అంగవైకల్యం కలిగినా వారికి రూ.2లక్షల బీమా, పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.1లక్ష బీమా ఉచితంగా అందిస్తారు ఇతర ప్రయోజనాలు కల్పిస్తారు. ఈ శ్రమ్ పోర్టల్‌లో చేరిన ప్రతి అసంఘటిత కార్మికునికి 12 అంకెలు గల ప్రత్యేక గుర్తింపు కార్డు యుఎఎన్ (యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నెంబరు) ఇస్తారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్నిరకాల సహాయం, సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలు అందుతాయి.

ఈశ్రమ్‌లో నమోదుకు ఎవరు వారు అర్హులు.?

అసంఘటిత రంగంలో కార్మికులై ఉండి 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు లోపు వారు ఇందులో చేరవచ్చు. ఈ శ్రమ్‌లో నమోదుకు కార్మికులు నగదు చెల్లించనవసరం లేదు. ఉచితంగానే నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఆదాయ పన్ను చెల్లించే వారు, ఇపిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలున్న వారు ఈ పథకానికి అనర్హులు. భవన నిర్మాణ కార్మికులు, నర్సరీ కార్మికులు, షాపులు సంస్థలలో పనిచేసే కార్మికులు, వలస కార్మికులు, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, చిన్న సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషకులు, బీడీ కార్మికులు, ఎలక్ట్రీషియన్లు, తాపీ పని వారు, కూలీలు, ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికులు, స్వారీ, సామిల్లు కార్మికులు, చేతివృత్తులు, హమాలీలు, వీధి వర్తకులు, ఆశా, అంగన్‌వాడీ తదితర కార్మికులంతా ఈ పథకంలో నమోదు చేసుకునేందుకు అర్హులు.

ఈ శ్రమ్‌లో కార్మికులు తమ పేర్లను ఎలా నమోదు చేసుకోవాలి.?

ఈ శ్రమ్‌లో నమోదుకు e-Shram portal website i.e https// register. eshram.gov.in/user-self లోగానీ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు లేదా సచివాలయాల్లోగానీ సిఎస్‌ఇ సెంటర్లలోనూ నమోదు జరుగుతోంది. కార్మికులు తమ ఆధార్‌తో పాటు బ్యాంకు పాస్ బుక్ నామినీ ఆధార్ వెంట తీసుకెళ్లాలి. అక్కడ పేర్లు నమోదు చేసుకోవాలి. సెల్ ఫోన్ తప్పనిసరిగా తీసుకు వెళ్లాలి. ఒటిపి నంబరు నమోదు అనంతరం ప్రక్రియ పూర్తవుతోంది. అక్కడే యుఎఎన్‌తో కూడిన ఈశ్రమ్ కార్డును జారీ చేస్తారు. ఆధార్‌తో లింక్లై ఉన్న ఫోన్ నెంబరు, బ్యాంకు అకౌంటు వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. యుఎఎన్ ఉన్న ప్రతీ ఒక్కరికి పిఎంఎస్‌బిఐ పథకం కింద రూ.2 లక్షలు, అంగవైకల్యం బీమా ఉచితంగా అందజేస్తారు. ఎలాంటి వివరాలు అవసరమైనా, లేదా అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

నమోదు, గుర్తింపు కార్డులు జారీ ప్రక్రియ జరుగుతోందా..?

భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేకంగా నమోదు ప్రక్రియ జరుగుతోంది. భవన, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం 1996 కింద నమోదుకు 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగి సంవత్సరంలో 90 రోజులు భవన, ఇతర నిర్మాణ రంగంలోని 26 విభాగాల్లో పని చేసే వారంతా అర్హులే. అర్హులైన కార్మికులు దరఖాస్తు ఫారం నింపి పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ మరియు బ్యాంకు అకౌంట్ జిరాక్స్ నామిని ఆధార్ బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ జతపర్చి నమోదు చేసుకోవాలి. నమోదుకు రూ.50, ఏటా రెన్యువల్‌కు రూ.12 చొప్పున చెల్లించాలి. ఈ గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియ ద్వారా ప్రమాద బీమాతో పాటు మహిళల ప్రసూతికి ప్రభుత్వం నగదు సహాయం అందజేస్తోంది. ఇప్పటి వరకూ జిల్లాలో 1.36 లక్షల మంది నమోదు చేయించుకున్నారు.

కార్మికులకు మీరు ఇచ్చే సూచన ఏమిటి..?

అసంఘటిత కార్మికులందరూ ఈ శ్రమ్‌లో నమోదు చేయించుకోవాలి. అదే విధంగా భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డుల కోసం నమోదు చేయించుకోవాలి. ఈ పథకాల ద్వారా కార్మికులు సామాజిక భద్రత, సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందే అవకాశం ఉంది. కార్మికుల వృత్తి నైపుణ్యాభివృద్ధి, మరిన్ని ఉపాధి అవకాశాలు అందించడానికి ఉపయోగపడుతుంది. ఆర్థిక సాయం నేరుగా కార్మికులు లేదా వారి నామినీల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. జిల్లాలో 57 వేల మంది భవన నిర్మాణ కార్మికులు మాత్రమే వైఎస్ఆర్ బీమాలో నమోదై ఉన్నారు. మిగిలినవారంతా వెంటనే భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకోవాలి. ఈ మేరకు కార్మిక శాఖ తరుపున ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం.

బాల మందిరంలో అలరించిన 'నాటకీకరణ'

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని మాధవపట్నం జమునానగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ కన్వీనర్ అంగర గోపాలకృష్ణ (కృష్ణశ్రీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నాటకీకరణ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు 'దేవుడ్ని చూసిన దొంగ కథ' నాటకీకరణ చేసి ప్రదర్శించారు. తెలుగు ప్రసిద్ధ రచయిత్రి, అలనాటి సినీనటి స్వర్గీయ జమున కళాసేవ, సామాజిక సేవలను బాల మందిరం గుర్తు చేసుకుంటూ ఆమె మృతికి సంతాపం ప్రకటించింది. ప్రజానాట్యమండలి గరికపాటి రాజారావు, బుర్రకథ పితామహుడు నాజర్ శిష్యురాలిగా జమున చేసిన కళాసేవను వక్తలు ప్రశంసించారు. విద్యార్థులు బాల మందిరం గ్రంథాలయంలోని బాలసాహిత్యం పుస్తక పఠనం చేశారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరంలోని సత్యదేవ లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యాన ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మురుసూరి ఉషారాజు తన పర్యటనలో భాగంగా ఆదివారం అన్నవరం లయన్స్ క్లబ్ భవనాన్ని సందర్శించారు. అన్నవరం క్లబ్ చేస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. భవనం అభివృద్ధికి రూ.50 వేల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పి.సునీత గుర్రాజు, ప్రతినిధులు దొంకాడ గిరి, అడపా సత్తిబాబు, మచ్చా నాగేశ్వరరావు, ఎన్ఎస్.ప్రకాష్, కె.సత్యనారాయణ, రోణంకి రాజు, డిసిఎస్.జానకి పాల్గొన్నారు.

నరసింహయ్యకు పలువురి ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం

సిపిఐ ఎంఎల్ (జనశక్తి) రాష్ట్ర కార్యదర్శి నంబి నరసింహయ్య సంతాప సభ ఆదివారం పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలోని దమ్ము పేటలో నిర్వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో నరసింహయ్య మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సభలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రసంగించారు. జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, గౌరవాధ్యక్షులు బాదంపూడి బాబూరావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి డి.సురేష్, పిడిఎస్‌యు నాయకులు వల్లూరి ప్రేమకుమార్, వీరబాబు, శివాజీ, ముసలి బాబు పాల్గొన్నారు.

ఇద్దరికి సేవా పురస్కారాల అందజేత

ప్రజాశక్తి-సామర్లకోట, సామర్లకోట రూరల్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణకు ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఉత్తమ సేవా పురస్కారం లభించింది. జిల్లా శాఖ కార్యదర్శి పివివి.వరప్రసాద్, టి.గంగాధర్, టివివి.సత్య నారాయణ, ఎంకెపి.వాణణీకుమారి, ఎన్ఎఆర్.మూర్తి, పద్మజ,ఆర్‌కె.రెడ్డి తదితరులు ఈ పురస్కారం పొందినట్లు సాయి రామకష్ణ తెలిపారు. ఈ పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందని రామకృష్ణ పేర్కొన్నారు. అచ్చంపేట ఎంపియుపి పాఠశాల హెచ్ఎం నల్లం శ్రీరామచంద్రమూర్తిని ఉత్తమ సేవా పురస్కారంతో సంస్థ సత్కరించింది. యువత నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా ఆత్మ విశ్వాసంతో మంచి పౌరులుగా ఎదగడానికి స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కృషిలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కో ఆర్డినేటర్ శ్రీరామచంద్రమూర్తికి ఈ అవార్డు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఈ సంస్థ ఫౌండర్

శ్రీరామచంద్రమూర్తిని సత్కరిస్తున్న ప్రతినిధులు

సహకారంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 26 మంది బాధితులను ఆత్మహత్యలకు పాల్పడకుండా నిలువరించినట్లు చెప్పారు. త్వరలో జిల్లాలో ఈ శాఖ కార్యాలయం ఏర్పాటు చేసి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. శ్రీరామచంద్రమూర్తిని అభినందించిన వారిలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, జెడ్‌పిటిసి ఎలిశెట్టి అమృత నరేష్ ఉన్నారు.

బాబీని సత్కరిస్తున్న పార్టీ నాయకులు

బాబీకి పలువురి ఘన సత్కారం

ప్రజాశక్తి- తాళ్లరేవు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన ధూళిపూడి వెంకటరమణను ఆదివారం పలువురు ఘనంగా సత్కరించారు. పి.మల్లవరం గ్రామానికి చెందిన ధూళిపూడి వెంకటరమణ (బాబి) మరిన్ని పదవులు అలంకరించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీలను బలోపేతం చేసుకోవాలి

ప్రజాశక్తి-కొత్తపేట

సొసైటీలను బలోపేతం తీసుకోవాలని . బాల యోగి ట్రైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్-.స్టీరింగ్ కమిటీ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ నాగరాజు అన్నారు. కమిటీ సమావేశం ముగ్గళ్ల మురళీకష్ణ అధ్యక్షతన మందపల్లిలో స్వామి టైలర్ షాపు వద్ద ఆదివారం నిర్వహించారు. తొలుత ఇటీవల చనిపోయిన ట్రైలర్లకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న 29 సొసైటీలను బలోపేతం చేయడానికి కార్యక్రమం రూపొందించారు. ఈ సమావేశం ప్రధానంగాం, ట్రైలర్స్ సొసైటీలకు వెంటనే ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని, 2, జగనన్న చేదోడు పదకం కావలసినను సమయం తక్కుగా ఉన్నందున ప్రభుత్వం మరికొంత సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫిబ్రవరి 28న ట్రైలర్స్ డే సందర్భంగా జిల్లాలో ఉన్న 29 సొసైటీలలో సహావేశాలు జరిపి టైలర్ల సమస్యలు, సొసైటీల గుర్తింపుకోసం ప్రతి మండల తహశీల్దార్‌కు మెమొరాండం సమర్పించాలని తీర్మానించారు. కార్యక్రమంలో సంఘఅదికార ప్రతినిధి. శ్యామ్ , వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, వారా భాస్కర రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కంశెట్టి స్వామి, సిహెచ్. నాగరాజు, రేక నూకరాజు, ట్రెజరర్ రాంబాబు, మహిళా అధ్యక్షురాలు కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించడేమ లక్ష్యం

ప్రజాశక్తి-అయినవిల్లి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని శంకరయగుడెం గ్రామంలో నిర్వహించిన గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు రాజేంద్రప్రసాద్, సచివాలయ గహసారదుల కన్వీనర్ పులిదిండి ప్రభాకర్, స్థానిక సర్పంచ్ బొక్క కామేశ్వరరావు, మాగం సర్పంచ్ కాశి సత్యనారాయణ, తోత్తరమూడి సర్పంచ్ వార జయ సావిత్రి, సొసైటీ అధ్యక్షులు కుడుపూడి రామకష్ణ, ఎంపిటిసి సభ్యులు గుత్తుల శ్రీరామమూర్తి, నాయకులు కుడుపూడి విద్యాసాగర్, గుత్తుల నాగబాబు, వార లక్ష్మీనరసింహం తాటిపాక జోషి కుమార్ పలు శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ఐ.పోలవరం** పాతఇంజరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గణేష నగర్, జగన్న కాలనీ, పాపాయి చెరువు గ్రామంలో వై సి పి మండల అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతిరాజు ఆధ్వర్యంలో ఎం పి పి మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్ పి టి సి సభ్యులు ముదునూరి సతీష్ రాజు సమక్షంలో ఆదివారం రెండ విడత గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్ఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంబంధిత అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులతో ఎమ్ఎల్ఎ సతీష్ కుమార్ కలిసి మూడున్నర ఏళ్లలో వై సి పి ప్రభుత్వం అందిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాశి ముని కుమారి, మోకా రవి, కాటం సత్తిరాజు, మోర్త చిన్నా, మట్టా గగనవీరుడు, పేరా బత్తుల కొండయ్య, చప్పిడి బుజ్జి పాల్గొన్నారు

అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-మండపేట

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదంను పలువురు దళిత నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామ అభివద్ధితో పాటు దళితుల సంక్షేమానికి కషి చేస్తున్న ఆశీర్వాదం సేవలు అభినందనీయమన్నారు. దళిత నాయకులు పలివెల సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు తాతపూడి ఉషా రాజేష్, దళిత ఖండవెల్లి మోషే, సిద్ధాంతపు అహరోను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189

'బ్లూ క్రాఫ్ట్' నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - బిక్కవోలు

బిక్కవోలు మండలం బలభద్రపురం శివారు కానేడులో ఉన్న బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకుడు వాసంశెట్టి గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్లూ క్రాఫ్ట్ ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షునిగా తోటకూర వెంకట సుబ్బారావు, కార్యదర్శిగా చోడవరపు శివరాం, ఉపాధ్యక్షునిగా పి.శాంతిబాబు, కోశాధికారిగా పూసల మణికంఠ, సహ కార్యదర్శిగా బి.దుర్గాప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం సంస్థ విశ్రాంత ఉద్యోగి కోరా

నూతన కార్యవర్గ సభ్యులు

సాయికృష్ణను, సంస్థ పూర్వపు ఉద్యోగి కవిడి పోసియ్యలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని వాసంశెట్టి గంగాధర్ సంస్థ ఉద్యోగులు అభినందించారు.

అందరికీ వైద్యసేవలే ఎన్‌టిఆర్ ట్రస్ట్ ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

అవసరమైన ప్రతి ఒక్కరికీ అన్ని రకాల వైద్య సేవలందించడమే ఎన్‌టిఆర్ ట్రస్ట్ ధ్యేయమని టిడిపి రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు, మాజీ మంత్రి జవహర్ అన్నారు. ప్రక్కిలంక గ్రామానికి చెందిన ప్రసన్న నర్సింగ్ హోమ్ 50వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు యువత సహకారంతో ఎన్‌టిఆర్ ట్రస్ట్, ప్రసన్న నర్సింగ్ హోమ్ సంయుక్తంగా ఆదివారం తాళ్లపూడిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు, కేన్సర్ వైద్య పరీక్షలు కూడా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రసన్న నర్సింగ్ హోమ్ డాక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు ఈ శిబిరంలో వైద్యసేవలు అందించారు. జిఎస్ఎల్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ పార్థసారథి మాట్లాడతూ ఈ వైద్య శిబిరంలో కేన్సర్ అనుమానం ఉన్న

వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

14 మందిని గుర్తించామని వీరికి రాజమండ్రిలో అదనపు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్ ప్రతినిధి శ్రీకాంత్ మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. స్థానిక ఆస్పత్రి డాక్టర్ భాను ప్రకాష్ మాట్లాడుతూ తెలుగు యువత సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో కొవ్వూరు నియోజకవర్గం టిడిపి దిసభ్య కమిటీ నాయకులు కె.రామకృష్ణ, కైకాల శ్రీను, కొట్టారు వెంకట్రావు,తెలుగుయువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేక అక్రమ కేసుల ప్రచారం

ప్రజాశక్తి -కొత్తపేట

అధికార పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వ లేక టిడిపి నాయకులు ఈ అక్రమ కేసుల ప్రచారం చేస్తున్నారని కొత్తపేట ఎంపిపి మార్గం గంగాధరరావు ఆరోపించారు. స్థానిక పలివెల గ్రామంలో చోటుచేసుకున్న రోడ్డు వివాదంపై వైసిపి నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ శాఖలు కూడా విధి నిర్వహణ భాగంగా వాళ్ల బాధ్యత నిర్వహించారే తప్ప వాళ్లపై అధికారి పార్టీ నాయకుల ఒత్తిడి గానీ పార్టీ ప్రమేయం ఏమీ లేదని అన్నారు. టిడిపి నాయకులు చేస్తున్న అక్రమ కేసుల ప్రచారం కేవలం అధికార పార్టీపై బురద జల్లే ప్రయత్నం తప్ప ఈ కేసులకి వారికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. జగనన్న కాలనీకి చెందిన మట్టిని అక్రమంగా తరలిస్తుంటే అడ్డుకుని అధికారుల కేసులు కడితే వాటిని కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి దుష్ప్రచారాలు టిడిపి నాయకులు చేస్తున్నారని అన్నారు. అసలు ఏ నిధుల నుంచి ఈ రోడ్డు పనులు ప్రారంభించారు అనేది తెలియజేయాలని ప్రశ్నించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కొత్తపేట ఎమ్ఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి పలివెలలో చేసిన అబివృద్ధి పనులను ఎంపిపి వివరించారు. కార్య క్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజ్, అన్నవరం దేవస్థానం సభ్యులు ముత్యాల వీరభద్రరావు, ముసునూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత ఉజ్వల భవితకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కడియం

మండలంలో యువత చెడు మార్గాల్లోకి వెళ్లకుండా పోలీసులు వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలని రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఆదివారం గోరంట్ల కడియం పోలీస్ స్టేషన్ కు చేరుకొని సిఐ తిలక్‌తో శాంతి భద్రతలపై సమీక్షించారు. రోజు రోజుకు నేరాలు పెరుగుతున్నాయన్నారు. నేరాలపై సరైన నియంత్రణ లేకపోవడంతో మండలంలో మత్తు పదార్థాల వాడకం పెరుగుతుందన్నారు. పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో యువకులు గంజాయి విక్రయించడం, వాడడం జరుగుతుందన్నారు. యువకులు మత్తుపదార్థాలకు బాని సలుగా మారారని , వీరిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి

కడియం సిఐతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల

వారి తల్లిదండ్రులు సమక్షంలో కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. అలాగే మండలంలో మత్తు పదార్థాలపై ప్రభుత్వం అవగాహన కార్యక్రమం చేపట్టాలని, గంజాయి సరఫరా చేసే వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా ఆశిష్

ప్రజాశక్తి-మండపేట

మునిసిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిగా మండపేట మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న తాళ్ల ఆశిష్ కుమార్, యర్రా రాజశేఖర్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కోనసీమ జిల్లా మున్సిపల్ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ యూనియన్ ఎన్నికలు కాకినాడ ఆనంద భారతి గ్రౌండ్స్ లో జరిగాయి. ఎన్నికలలో ఆశిష్ కుమార్ ప్యానల్ విజయం సాధించింది. కార్యదర్శిగా పి. శ్రీనివాసరావు వైస్ ప్రెసిడెంట్ గా భాస్కర్ లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

సముద్రంలో బోటు బోల్తా.. మత్స్యకారులు సురక్షితం

ప్రజాశక్తి -కాట్రేనికోన

కాట్రేనికోన మండలం కందికుప్ప లైట్ హౌస్ మొగ ప్రాంతంలో ఇంజిన్ బోటు(తెప్ప) గాలులకు బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. మండల పరిధిలోని బలుసుతిప్పలోని కొత్తపేటకి చెందిన కాలాడి ధర్మారావు ఇంజిన్ బోటులో అతనితో పాటు అదే ప్రాంతానికి చెందిన కాలాడి ఆదినారాయణ, కాలాడి గంగాద్రి, పెమ్మాడి ఆదినారాయణ వేట నిమిత్తం శుక్రవారం ఉదయం సముద్రంలోకి వెళ్లారు. వాతావరణంలో మార్పుల వల్ల ఆదివారం సాయంత్రం తిరిగి వస్తున్నప్పుడు లైట్ హౌస్ మొగ ప్రాంతంలో బలమైన గాలులు వీయడంతో ఇంజిను బోటు బోల్తా పడడంతో నలుగురు మత్స్యకారులు సముద్రంలో పడిపోయారు. బోటుకు ఉన్న తాళ్ల సాయంతో వారు తిరిగి బోటులోకి చేరుకున్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న గ్రామస్తులు వారిని తీసుకు వచ్చేందుకు మూడు బోట్లలో సముద్రంలోకి వెళ్లారని గ్రామ సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు ఆదినారాయణ తెలిపారు. మత్స్యకారులు సురక్షితంగా ఉండడంతో గ్రామస్తులు, అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనలో ఫిషింగ్ వలలు గల్లంతు కావడంతో పాటు బోటుకి నష్టం వాటిల్లిందని నష్టం సుమారుగా రూ.8లక్షల వరకు ఉంటుందని అంచనా.

నోటీసు
మహారాజశ్రీ నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
HMOP No.143/2022
బిట్వీన్:-
తీర్థాల హరిచైతన్య ...పిటీషనర్
మరియు
వాడపల్లి దుర్గా ధరణి @ తీర్థాల దుర్గా ధరణి ...రెస్పాండెంటు
To
వాడపల్లి దుర్గా ధరణి @ తీర్థాల దుర్గా ధరణి
తండ్రి. లేటు పవన్ కుమార్, R/o. D.No.5-12-2, శివాలయం బజారు, కొవ్వూరు గ్రామం & మండలం, తూర్పు గోదావరి జిల్లా.
పై నెంబరు పిటీషన్‌లో మీరు రెస్పాండెంట్ వారు అయి ఉన్నారు. మీ హాజరు నిమిత్తం వాయిదా ది.23-12-2022. వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజున మీరు గాని, మీ తరుపున లాయరు గాని పై కోర్టువారి ఎదుట ఉదయం గం॥10-30ని॥లకు హాజరు కావలసి ఉన్నది లేని పక్షంలో మీకు వ్యతిరేకంగా తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:23-12-2022
బెజవాడ నారపరెడ్డి,
న్యాయవాది,
జగ్గయ్యపేట టౌన్ అండ్ మండలం.
ఎన్.టి.ఆర్ జిల్లా.

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో : పిఠాపురం
O.S. No. 55/2021
Between:
CANARA BANK, Tuni Branch
rep. by its **Branch Manager,** Tuni ...Plaintiff
and
YAJJALA CHANDRA SEKHAR,
S/o. Appala Raju, D.No. 1-90,
Addaripeta Village, Thondangi Mandal,
Kakinada District. ...Defendant
పై నెంబరు దావాలో ప్రతివాదియైన మీకు ఎన్నివార్ల కోర్ట ద్వారా నోటీసులు పంపించినను తీసుకొనకుండా కాలయాపన చేస్తున్న కారణంగా కోర్టువారి అనుమతిని ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది ఏమనగా. సదరు పై దావా మీ హాజరు నిమిత్తం **ది. 03-02-2023నకు** వాయిదా అయి ఉన్నది. కావున మీరు **ది. 03-02-2023వ తేదీన** పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు నందు **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరు అయి స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఆక్షేపణలుంటే తెలియచేసుకోవలెను. అట్లు కాని యెడల సదరు పైదావాని కోర్టువారు మీ పరోక్షమున తీర్మానింతురని యిందుమూలముగా తెలియచేయడమైనది.
పడాల రవి, అడ్వకేట్
పిఠాపురం. పిఠాపురం. తూ॥గో॥జిల్లా.
తేది:28-1-2023 సెల్: 98480 11614

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P.No. 148/2022
బిట్వీన్:
అల్లం @ బిట్రా నాగసాయి ...పిటీషనర్
మరియు
అల్లం పద్దరాజు ...ప్రతివాది
టు: అల్లం పద్దరాజు, తండ్రి: రాములు, డో.నెం. 4-7, వడిసిలేరు గ్రామం, రంగంపేట మండలం, తూ॥గో॥జిల్లా, పిన్: 533294.
పై నెంబరు పిటీషనులో ప్రతివాదికి నోటీసులు పంపగా ప్రతివాది పిటీషను సంగతులు తెలిసియుండి నోటీసులు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substitutional Service ద్వారా అమలు జరుపుటకు గాను **ది.09-02-2023వ తేదీకి శ్రీ కోర్టు వారు వాయిదా వేసినారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు పై పిటీషనులో నోటీసు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
తోట జగదీష్ కుమార్
తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
29-1-2023. సెల్: 80960 26627